భూసేకరణ వేగవంతం చేయాలి : కలెక్టర్

మామిళ్లగూడెం/ రఘునాథపాలెం/ ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 18 : జిల్లాలో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. అధికారులను ఆదేశించారు. ఇందుకోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఐడీవోసీలోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. వివిధ ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో ఆయన మాట్లాడుతూ.. నేషనల్ హైవే 365బీ, ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌కు ప్యాకేజీ 1, 2, 3లకు సంబంధించి 1,358 ఎకరాల భూ సేకరణకుగాను 1292 ఎకరాలకు అవార్డు పూర్తి చేసినట్లు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ఏన్కూరు లింక్ కాల్వ మిగులు భూ సేకరణ పూర్తిపై దృష్టి పెట్టాలన్నారు.

వ్యాపార విస్తరణ, లాభాలపై అవగాహన కల్పించాలి

వ్యాపార విస్తరణ, లాభాలపై మహిళకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్.. సంబంధిత అధికారులకు సూచించారు. ఇందిరా మహిళాశక్తి అమలుపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసే సామగ్రిని విక్రయించుకునేందుకు మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఆ సామగ్రి నాణ్యంగా ఉండాలని, ఆ వస్తువులకు బ్రాండింగ్ లోగోలు డిజైన్ చేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మెరుగైన సేవలందించాలి

ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వస్తున్న ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, వారి సమస్యలను ఓపికగా విని వాటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు.

విద్యార్థులకు ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

విద్యార్థులకు ఆంగ్ల పరిజ్ఞానాన్ని దశల వారీగా పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లాలో 'వియ్ కెన్ లెర్న్'కార్యక్రమం అమలవుతున్న మామిళ్లగూడెం, కొణిజర్ల, పల్లిపాడు ఉన్నత పాఠశాలలను తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్షిప్ కలెక్టివ్ ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఆ ప్రతినిధులతో కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 34 పాఠశాలలలో 6, 7 తరగతుల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు అమలు చేస్తున్నామని అన్నారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆయా శాఖల అధికారులు రామాంజయనేయరెడ్డి, హేమలత, నర్సింహారావు, రాజేందర్, సన్యాసయ్య, నవీన్‌బాబు, నూరుద్దీన్, సోమశేఖరశర్మ, రవికుమార్, పవిత్ర, అస్త్ర తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలకు బాధ్యులవుతారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పష్టంచేశారు. పని చేయడం ఇష్టం లేకపోతే సెలవుపై వెళ్లాలని మందలించారు. అనవసరంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు. మండంలోని మంచుకొండ పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఇద్దరు డాక్టర్లు లేకపోవడం, కేవలం ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వైద్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో వైద్యుల హాజరును నిరంతరం పరిశీలించాలని, డ్యూటీ పీరియడ్‌లో వైద్యులు తప్పక ఆసుపత్రిలోనే ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఔట్ పేషంట్ సేవలు, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్, ల్యాబ్ పరీక్షల నమూనా రిజిస్టర్, మందుల నిల్వలను పరిశీలించారు.

తండ్రి శబరిమలైకు.. కూతురు అనంతలోకాలకు..

లారీ కిందపడి విద్యార్థిని దుర్మరణం

హర్షశ్రీ (ఫైల్)

వైరాటౌన్, డిసెంబర్ 18 : లారీచక్రాల కింద నలిగి గురుకుల విద్యార్థిని దుర్మరణం పాలైన హృదయ విదారకర ఘటన వైరాలో బుధవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకెళ్తే.. రఘునాథపాలెం మండలం కోయచెలక గ్రామానికి చెందిన చెరుకూరి హర్షశ్రీ(13) వైరాలోని గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నది. తండ్రి వీరబాబు అయ్యప్ప ఇరుముడి కార్యక్రమం మంగళవారం ఖమ్మంలో జరిగింది. దీనికోసం హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన హర్షశ్రీ బుధవారం తిరిగి పాఠశాలకు మేనమామ శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై పయనమైంది. మరో రెండు నిమిషాల్లో పాఠశాలకు చేరుకోవాల్సి ఉండగా.. వైరా రింగురోడ్డు సెంటర్‌లో ఓ వైపు మున్సిపాలిటీకి చెందిన చెత్త ట్రాక్టర్ పార్కింగ్ చేసి ఉండడంతో ద్విచక్ర వాహనాన్ని సడన్‌గా క్రాస్ చేసేందుకు ప్రయత్నించగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హర్షశ్రీ లారీ వెనుక టైర్ల కింద పడి ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ దృశ్యం చూసిన ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టించింది. అయ్యప్ప దీక్ష పూర్తిచేసి శబరిమలై వెళ్తున్న తండ్రి వీరబాబు కూతురు మరణవార్త విని ఇంటికి తిరిగి పయనమయ్యాడు. ఘటనా స్థలాన్ని వైరా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబీకులు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు చూపరులను కంటనీరు పెట్టిస్తున్నది.

ముగిసిన సీఎం కప్ క్రీడలు

గెలుపొందిన వారితో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం సిటీ, డిసెంబర్ 18: ఖమ్మం పటేల్ స్టేడియంలో మూడు రోజుల నుంచి హోరాహోరీగా సాగిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు పురుషులు, మహిళల విభాగాల్లో జూనియర్లు, సబ్ జూనియర్లకు సైతం చెస్, షూటింగ్, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్‌తోపాటు అథ్లెటిక్స్‌లో డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, లాంగ్ జంప్ తదితర పోటీలను నిర్వహించారు. వాటికి మండల, పట్టణ స్థాయి క్రీడల్లో గెలుపొందిన 711 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు సాయంత్రం స్టేడియంలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. వివిధ క్రీడా విభాగాల అధికారులు, కోచ్‌లు నరసింహమూర్తి, ఎండీ షఫీ, అక్బర్ అలీ, హరీష్, నగేశ్, కైలాశ్, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

'కీర్తి' ఆరోగ్యం నిలకడగా ఉంది: డీఎంహెచ్‌వో

ఖమ్మం సిటీ, డిసెంబర్ 18: ఎలుకలు కరవడంతో ఆరోగ్యం క్షీణించిన దానవాయిగూడెం బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థిని సముద్రాల లక్ష్మీ భవానీ కీర్తి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి అన్నారు. ఖమ్మం మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కీర్తిని బుధవారం రాత్రి ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మంచుకొండ వైద్యాధికారి పంపిన నివేదికను వెల్లడించారు. ప్రస్తుతం మమత ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నదని, ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే కోలుకుంటుందని వివరించారు. పీవో డాక్టర్ చందునాయక్, మంచుకొండ వైద్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ

కారేపల్లి, డిసెంబర్ 18 : కారేపల్లి, కామేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను బుధవారం జిల్లా వైద్యశాఖ అధికారి బి.కళావతిబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిశువులకు ఇస్తున్న వ్యాక్సిన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. మందులు, వ్యాక్సిన్‌లు నిల్వ ఉంచే ప్రదేశాలను సందర్శించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. పల్లె దవాఖానాల నిర్వహణపై మండల వైద్యాధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుపుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారులు బి.సురేష్, నెల్లూరి చందన, సూపర్‌వైజర్లు సరస్వతి, సూర్యం పాల్గొన్నారు.

జిల్లాస్థాయి విజేతగా మధిర జట్టు

మధిర, డిసెంబర్ 18 : సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో మధిర జట్టు విజేతగా నిలిచింది. జిల్లా యువజనుల క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బాలికల కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 481 మంది క్రీడాకారులు హాజరుకాగా అత్యంత హోరాహోరీగా జరిగిన కబడ్డీ పోటీల్లో మధిర బాలికల జట్టు విజేతగా నిలిచింది. క్రీడాకారులకు యువజన క్రీడాశాఖ జిల్లా అధికారి సునీల్‌రెడ్డి జ్ఞాపికలతోపాటు కప్ అందజేశారు. క్రీడాకారులను మధిర అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సుబ్బారావును పరామర్శించిన లింగాల

నివాళి అర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర రూరల్, డిసెంబర్ 18 : మండల పరిధిలో మాటూరుపేట గ్రామానికి చెందిన రంగ స్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు తల్లి ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు బుధవారం వారికి ఇంటికెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్బారావును పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగిని హైమావతి మృతి

పది రోజులుగా సమ్మె చేస్తుండడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడి

ఐదు రోజుల క్రితం గుండెపోటు.. చికిత్స పొందుతూ మృతి

తిరుమలాయపాలెం/ ఖమ్మం రూరల్, డిసెంబర్ 18: గుండెపోటు కారణంగా ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగిని మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన కంచం హైమావతి (42) పొరుగునే ఉన్న తిరుమలాయపాలెం ఎమ్మార్సీలో (సమగ్ర శిక్షా అభియాన్ విభాగం) కంప్యూటర్ ఆపరేటర్‌గా 19 ఏళ్లుగా పనిచేస్తోంది. ఈ క్రమంలో తమను రెగ్యులరైజ్ చేయాలంటూ సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు ఈ నెల 7 నుంచి సమ్మె చేస్తున్నారు. ఆ ఆందోళనలో ఆమె కూడా పాల్గొన్నది. ఈ నేపథ్యంలో మానసిక ఒత్తిడికి గురైన హైమావతి ఈ నెల 13న అస్వస్థతకు గురైంది. అదే సమయంలో ఆకస్మికంగా గుండెపోటుకు గురైంది. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మరణించింది. మృతురాలికి భర్త అచ్యుత్‌రావు, ఇంటర్ చదివే కుమార్తె లిఖిత ఉన్నారు. కాగా, విషయం తెలుసుకున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు.. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాలో ఆమె నివాసం వద్ద ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల శాంతి ర్యాలీ..

మానసిక ఒత్తిడి, గుండెపోటు కారణంగా మృతిచెందిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగిని హైమావతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం నాయకురాలు ఝాన్సీ సౌజన్య డిమాండ్ చేశారు. పెద్దతండాలోని ఆమె నివాసానికి బుధవారం పెద్ద సంఖ్యలో చేరుకున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు.. ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకురాలు ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ.. పని ఒత్తిడి, ఉద్యోగ భద్రతపై బెంగ కారణంగానే గుండెపోటు వచ్చి హైమావతి మృతిచెందిందని అన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. హైమావతి ఆశయ సాధనను అనుగుణంగా ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పాషా, అక్కినపల్లి విజయ్, ఉపేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

రైతాంగాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

మాట్లాడుతున్న బీవీ రాఘవులు

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 18 : రైతాంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. సత్తుపల్లి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన ఖమ్మం జిల్లా సీపీఐ(ఎం) 22వ మహాసభల్లో పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఒకే దేశం.. ఒకే ఎన్నిక విధానం అత్యంత ప్రమాదకరమని అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో దేశ భవిష్యత్‌కు ప్రమాదం కలిగించే విధానాలను బీజేపీ తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నదన్నారు. ర్యాలీ అగ్రభాగాన తమ్మినేని, రాఘవులు, సాయిబాబు, బీ.వెంకట్, పాలడుగు భాస్కర్, నున్నా నాగేశ్వరరావు, సోమయ్య, బుగ్గవీటి సరళ తదితరులు నడిచారు. సీపీఐ(ఎం) జెండాను పార్టీ సత్తుపల్లి డివిజన్ మాజీ కార్యదర్శి తాతా భాస్కర్‌రావు ఆవిష్కరించారు.

గడువులోగా సీఎంఆర్ పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, డిసెంబర్ 18 : కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) డెలివరీని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పీ.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. 2024–24 వానకాలం, యాసంగి పంటల్లో వడ్ల నుంచి మిల్లింగ్ చేసిన బియ్యాన్ని (సీఎంఆర్) ప్రభుత్వానికి అందించే అంశంపై జిల్లాలోని మిల్లర్లు, రెవెన్యూ, సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నాణ్యత లేని ధాన్యం ఉంటే రైస్ మిల్లులు తీసుకోవద్దని అన్నారు. అధికారులు చందన్‌కుమార్, శ్రీలత, మిల్లర్లు, డీటీలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

అంటుమామిడి మొక్కలు సిద్ధం

ఖమ్మం రూరల్, డిసెంబర్ 18 : రైతులకు అంటుమామిడి మొక్కలు అందించేందుకు ఉద్యానశాఖ సిద్ధంగా ఉందని పాలేరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి పీ అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలోని ఉద్యాననర్సరీలో బంగినపల్లి, తోతాపురి, హిమాయత్ వంటి రాకల మొక్కలు ఉన్నాయన్నారు. మొక్క వయస్సు 1–2 సంవత్సరాలు కలిగి, 3–4 అడుగుల ఎత్తులో ఉన్నాయన్నారు. ఒక్కో మొక్క ఖరీదు రూ.40 ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు 8977714104 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సంబురంగా శ్రీచైతన్య కాలేజ్ ఉత్సవాలు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్

ఖమ్మం రూరల్, డిసెంబర్ 18 : మండలంలోని శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రీసెర్చ్ ప్రాంగణంలో రెండురోజులపాటు జరిగే శ్రీచైతన్య జూనియర్ కళాశాల సాంస్కృతిక ఉత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీరాం జలదుర్గం హాజరయ్యారు. అతిథులుగా డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, డీజీఎం చేతన్ మాథూర్, ఎగ్జిక్యూటివ్ డీఎంఆర్‌ఎస్‌డీ వర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో ఎదురయ్యే ఒత్తిడి తొలగించి విద్యార్థుల్లో మానసిక ఉత్సాహంతోపాటు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నాడు కేవలం 80మంది విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థలు ప్రారంభమై నేడు 1.07 లక్షల మంది విద్యార్థులు, 125 బ్రాంచీలు, 15 వేల మంది సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడం జరిగిందన్నారు. శ్రీరాం జలదుర్గం మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులతో విజువలైజేషన్ ప్రక్రియ సాధన చేయించారు. కార్యక్రమంలో ఏజీఎంలు సీహెచ్ బ్రహ్మం, జీ గోపాలక్రిష్ణ, జీ ప్రకాష్, రత్నాకర్‌రావు, మురళీకృష్ణ, సుదర్శన్ పాల్గొన్నారు.

డిప్లొమా ఫలితాల్లో మిస్ట్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్, డిసెంబర్ 18: 2024–25 విద్యా సంవత్సరంలో నవంబర్‌లో నిర్వహించిన పాలిటెక్నిక్ 3వ, 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో మిస్ట్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. 3వ సెమిస్టర్ ఫలితాల్లో సీఎస్సీ బ్రాంచ్ నుంచి బొట్టు రామ్ విద్య 9.87 ఎస్‌జీపీఏ, ముటిన హర్షిత 9.87 ఎస్‌జీపీఏ, షేక్ యశ్విన్ 9.73 ఎస్‌జీపీఏ, కలకొడిమ సాయిరామలక్ష్మీప్రత్యూష 9.60 ఎస్‌జీపీఏ, ఈఈఈ బ్రాంచ్ నుంచి ఇమ్మడి ఉదయ్‌గణేష్ 9.27 ఎస్‌జీపీఏ, ఈసీఈ బ్రాంచ్ నుంచి జక్కంపూడి జీవన్‌కుమార్ 7.73 ఎస్‌జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో సీఎస్సీ విభాగం నుంచి ఎ.పవన్‌కుమార్ 9.60 ఎస్‌జీపీఏ, పీ.గణేష్ 9.47 ఎస్‌జీపీఏ, కే.షినోజ్ 9.33 ఎస్‌జీపీఏ, ఈసీఈ బ్రాంచ్ నుంచి జలగం స్పందన 9.20 ఎస్‌జీపీఏ, మహరోజు హిమరత్నం 8.80 ఎస్‌జీపీఏ, రేగళ్ల చందన 8.53 ఎస్‌జీపీఏ సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీ.హెచ్.హరికృష్ణ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, డిప్లమా డీన్ ఎం.వీ.రామచంద్రరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఆటో చోరీ నిందితుడికి రిమాండ్

మామిళ్లగూడెం, డిసెంబర్ 16: నగరంలో ఆటోలు దొంగతనం చేస్తున్న నిందితుడిని గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మధు బుధవారం ఉదయం తన ఆటోలో రోగులను తీసుకొని ఖమ్మం వినోద మహల్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి వచ్చాడు. మధు తన ఆటోను బయట పార్క్ చేయగా గోసుల వెంకన్న చోరీ చేశాడు. మధు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు వెంకన్నను గుర్తించారు. కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కూసుమంచి, డిసెంబర్ 18 : నాయకన్‌గూడెం వద్ద కాలువలో స్నానం కోసం వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం పాలేరు చెరువులో మత్స్యకారులకు బుధవారం దొరికింది. ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం కొద్ది సంవత్సరాలుగా నాయకన్‌గూడెంలో ఉంటూ పాత ఇనుము సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం స్నానం చేయడానికి సాగర్ ఎడమ కాలువకు వెళ్లిన ఇబ్రహీం గల్లంతయ్యాడు. బుధవారం మత్స్యకారులు చేపలవేటకు వెళ్లగా ఇబ్రహీం మృతదేహం కనిపించడటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ముదిగొండ, డిసెంబర్ 18 : అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను ముదిగొండ పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. సువర్ణాపురం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయని, ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీ తెలిపారు.

హత్య కేసులో జీవితఖైదు

పెనుబల్లి, డిసెంబర్ 18: పెనుబల్లి మండలం బ్రాహ్మళకుంట గ్రామంలో 2019లో జరిగిన హత్యకు సంబంధించిన నిందితులు ఆరుగురికి సత్తుపల్లి 6వ అదనపు జడ్జీ శ్రీనివాస్ జీవితఖైదు విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. 2019లో టీఆర్‌ఎస్ నాయకుడు ఏటుకూరి నరసింహారావును అతి కిరాతకంగా కర్రలతో దాడి చేసి హత్య చేశారు. 5 సంవత్సరాల విచారణ అనంతరం బ్రహ్మళకుంట గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులకు జీవిత ఖైదు, జరిమాన విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

కూసుమంచి (నేలకొండపల్లి), డిసెంబర్ 18: దంపతుల మధ్య గొడవలు.. భర్త బలవన్మరణానికి కారణమయ్యాయి. నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామానికి చెందిన పసుపులేటి రవి–ఉమ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ ఇటీవల పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావాలని రవి కోరినప్పటికీ ఆమె స్పందించలేదు. దీంతో, రవి ఎలుకల మందు పేస్ట్ తిన్నాడు. ఆయనను కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడు బుధవారం మృతిచెందాడు. రవి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి తల్లి కోటమ్మ ఫిర్యాదుతో కేసును ఎస్సై సంతోష్ దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ నిందితుల అరెస్ట్

తిరుమలాయపాలెం, డిసెంబర్ 18: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ల చోరీ నిందితుల ముఠాను తిరుమలాయపాలెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాలు.. తిరుమలాయపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో ఈ నెల 13న గుర్తుతెలియని వ్యక్తులు ఓ సెల్ టవర్‌కు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైర్లను దొంగిలించారు. దీనిపై అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు సాగించారు. ప్రధాన నిందితులైన వరంగల్ నగరంలోని శివ నగర్‌కు చెందిన మహిళలు సాలమ్మ, ఎల్లమ్మ, లక్ష్మి, సునిత, ఆటో డ్రైవర్ ఎల్లస్వామిని అదుపులోకి తీసుకున్నారు. వారిని బుధవారం ఖమ్మం కోర్టులో రిమాండ్ చేశారు. హైదర్‌సాయిపేట, ఏలువారిగూడెం, కూసుమంచిలో ఇటీవల జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం, కాపర్ వైర్ల చోరీ కేసుల్లోనూ వీరు నిందితులుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

అమ్మకం

★ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ సత్తుపల్లి బ్రాంచి వారి ఈ క్రింది వాహనములు అమ్మకమునకు కలవు. TS28T5499 TATA LPT 3718 - 2017, AP07 TJ-2547 TATA LPT 3718 -2018, AP39U - 7405 TATA LPT 3718-2019, TS28T - 7111 TATA LPT 3718 -2018, AP39T -8349 TATA LPT 4223 -2019, TS07UE -8586 TATA LPT 3118 -2018, TS29B -8152 ZEST 1.3L XE DIS 5 SET -2017, TS28TA -1125 TATA ULTRA 1518 -2019, AP16TE 6523 TATA LPT 3718 -2017, AP21TE 6363 TATA LPT 4223 -2018, TS04UA 1396 TATA ACE - 2014, TS04UA -1735 M/M 475 DI -2014, AP01Y -7992 TATA LPT 3118 -2013 ప్రకటన తేదీ నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును. సంప్ర : 9666382345, 9000014364
KMM

CHANGE OF NAME

★I, **BUTTI KIRAN KUMAR**, S/O. **BUTTI NAGESWARA RAO** (OLD NAME), R/o. H.No.10119, Singabhupalem Village, Sujathanagar Mandal, BHADRADRI KOTHAGUDEM DIST-507120, TELANGANA. Changed my Father's name as **BUTTI ABRAHAM** (NEW NAME).
-KMM

CHANGE OF NAME

★I, **KONDA SANTHOSH KUMAR** (OLD NAME) R/o. H.No.16-3-55, Nagaiahgadda, Ramavaram, Kothagudem Mandal, BHADRADRI KOTHAGUDEM DIST-507115, TELANGANA. Changed my name as **KONDA SANTOSH KUMAR** (NEW NAME) S/O. Konda Rajaiah.
-KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

ఆరోపణలపై విచారణ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 18: నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు అంశాలపై వచ్చిన ఆరోపణలపై డిగ్రీ విద్య కమిషనర్ దేవసేన విచారణకు ఆదేశించారు. దీనిలో భాగంగా నల్గొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కపిలవాయి శ్రీనివాసరాజును విచారణాధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఖమ్మానికి చేరుకున్న ఆయన.. కళాశాలలో ఆరోపణలపై విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది నుంచి రాత పూర్వకంగా వివరాలు సేకరించారు. మూడేళ్ల కళాశాల రికార్డులు పరిశీలించారు. రికార్డులను, సేకరించిన సమాచారాన్ని నివేదిక రూపంలో కమిషనర్‌కు అందజేయనున్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రతి శనివారం గేమ్స్ : ఏసీ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 18: ఇంటర్ విద్యార్థులకు ప్రతీ శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గేమ్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీజ.. కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ కళాశాలలో టెలీ మానస టోల్ ఫ్రీ నంబర్ 14416, యాంటీ డ్రగ్స్ టోల్ ఫ్రీ నంబర్ 1908ను ప్రదర్శించాలని సూచించారు. ఒత్తిడికి గురైన విద్యార్థులను గుర్తించి మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లాలన్నారు. కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు రవి బాబు, కళావతిబాయి, రాము పాల్గొన్నారు.

టీబీఎస్‌ఎఫ్ టాలెంట్ టెస్ట్

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 18: తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం (టీబీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ ఎంఈవో కార్యాలయంలో బుధవారం జిల్లాస్థాయి టాలెంట్ టెస్టును నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా ఎంపికైన విద్యార్థులు ఈ జిల్లా స్థాయి టెస్టుకు హాజరయ్యారు. మొత్తం 88 మంది విద్యార్థులు ఈ టెస్టు రాయగా.. ఇంగ్లిష్ మీడియం నుంచి ఇద్దరిని, తెలుగు మీడియం నుంచి ఇద్దరిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ నలుగురికి మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఫోరం బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్రివేణి విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 18: నగరంలోని త్రివేణి స్కూల్ విద్యార్థులు సీఎం కప్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. బ్యాడ్మింటన్ విభాగంలో వినయ్ మొదటి స్థానంలో, విశ్వతేజన్ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, కృష్ణవేణి – త్రివేణి విద్యా సంస్థల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీఆర్‌వో మురళీకృష్ణ, స్వప్న, ముస్తాఫా, చార్లెస్, సందీప్ తదితరులు అభినందించారు.

విధుల్లో చేరిన డీఈవో

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 18: వారం రోజులుగా సెలవులో ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) సోమశేఖరశర్మ బుధవారం తిరిగి విధుల్లో చేరారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 11 నుంచి ఈ నెల 17 వరకు ఆయన సెలవులో ఉన్నారు. బుధవారం తిరిగి విధుల్లో చేరిన అనంతరం కొణిజర్లలోని పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు.

'వరికొయ్యల కాల్చివేతతో భూసారానికి ముప్పు'

రఘునాథపాలెం, డిసెంబర్ 18: వరి కొయ్యల కాల్చివేతతో పర్యావరణానికి, భూసారానికి ముప్పు వాటిల్లుతుందని ఏఈవో శిరణ్మయి రైతులకు సూచించారు. వీ వెంకటాయపాలెం క్లస్టర్ పరిధిలోని రైతుల పొలాలను బుధవారం పరిశీలించిన ఆమె.. అక్కడి రైతులతో మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. పంటల అవశేషాలను కాల్చకుండా పొలంలోనే కలియదున్నాలని సూచించారు. లాభసాటి వ్యవసాయం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

20 నుంచి ఉచిత యోగా'

రఘునాథపాలెం, డిసెంబర్ 18: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఖమ్మానికి చెందిన శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు రఘునాథపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు, వీరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5:30 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణకు 15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ హాజరుకావచ్చని తెలిపారు. వివరాలకు 9989606020 నంబరులో సంప్రదించాలని కోరారు.

గురుకుల విద్యార్థినికి పరామర్శ

ఖమ్మం డిసెంబర్ 18 : హాస్టల్‌లో ఎలుకలు కరిచిన కారణంగా స్థానిక మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దానవాయిగూడెం బీసీ గురుకుల విద్యార్థిని కీర్తి కేఎంసీ 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ పరామర్శించారు. సదరు ఆసుపత్రికి బుధవారం వెళ్లిన మక్బూల్.. విద్యార్థినికి అందుతున్న వైద్యం గురించి, ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

ఖమ్మం, డిసెంబర్ 18: ఖమ్మం నగరంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం పరిశీలించారు. నగర వ్యాప్తంగా కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఈ సర్వే ప్రకియను, సిబ్బంది పనితీరును ఆయన స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే లక్ష్యంగా ఈ యాప్ సర్వే కొనసాగుతుందన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

సత్తుపల్లి, డిసెంబర్18: మండల పరిధిలోని గంగారం 15వ పోలీస్ బెటాలియన్‌లో బుధవారం నూతనంగా నిర్మించిన బెటాలియన్‌లోని మెయిన్‌గేట్, గార్డ్‌రూం, బెటాలియన్ రిసెప్షన్ రూంలను కమాండెంట్ పీజేపీసీ.ఛటర్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెటాలియన్‌లో సిబ్బంది, అధికారుల సహకారం కృషి ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీధర్‌రాజా, ఎస్.డీ.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మామిళ్లగూడెం, డిసెంబర్ 18: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఇందిరా మహిళ శక్తి పథకంలో మైనార్టీ మహిళలకు అందించే ఉచిత కుట్టు మెషీన్ల కోసం ఆసక్తిగల ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీల మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. www.tgobmms.cgg.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ జిల్లా కార్యాలయంలోగానీ, 9704003002 నంబరులోగా సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకుల నివాళి

ఎర్రుపాలెం, డిసెంబర్ 18 : ఎర్రుపాలెం గ్రామానికి చెందిన వేల్పుల దావీదు(49) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, మస్తాన్‌వలీ, తిరుపతిరావు, బాబుషా, ఇమాంస, బాజీ, కిషోర్‌బాబు, భాస్కర్‌రావు, రవి, గద్దల శ్రీనివాసరావు, దానయ్య, మహేష్ ఉన్నారు.